క్లుప్తంగా

నేటి నుంచి సీతారామచంద్ర స్వామి సప్తాహాలు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నుంచి జూన్ 7వ తేదీ వరకూ సీతారామచంద్రస్వామి సప్తాహాలు జరుగుతాయని ఆ గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సప్తాహాల్లో భాగంగా రెండో రోజు సూర్యనారాయణమూర్తికి సూర్యనమస్కారాలు, మూడో రోజు పార్వతీ పరమేశ్వరులకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, నాలుగో రోజు వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం, ఐదో రోజు లక్ష్మీగణపతి స్వామికి అభిషేకం, అర్చన, హోమం నిర్వహిస్తారన్నారు. ఆరో రోజు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం, ఏడో రోజు మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజ, 8వ రోజు పూర్ణాహుతి, వసంతోత్సవం అనంతరం అన్న సమారాధన జరుగుతుందన్నారు.

రేపటి నుంచి రేషన్ షాపుల్లో సరకుల పంపిణీ

సీతానగరం: మండల గ్రామాల్లో రేషన్ షాపుల వద్ద ఆదివారం నుంచి రేషన్ సరకుల పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం నుంచి మండలంలోని రేషన్ షాపుల వద్దకు వెళ్లి బియ్యం, పంచదార తీసుకువెళ్లవచ్చన్నారు. మండలంలో 44 రేషన్ షాపులు ఉన్నాయని, ఆయా షాపుల వద్ద అందుబాటులో ఉన్న నాయకులచే రేషన్ సరకుల పంపిణీని ప్రారంభిస్తారన్నారు. మండలంలో సుమారు 24 వేల వరకు రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ ఎండీయూ వాహనాల ద్వారా నేరుగా ఇళ్లకు రేషన్ సరకులు కార్డుదారులకు అందించేవారని, వాటిని ప్రభుత్వం నిలుపుదల చేయడం జరిగిందన్నారు.

మూడు నెలలుగా జీతాల్లేవు



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవిడ్ రాజు

రాజానగరం: దివాన్ చెరువు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు మూడు నెలలుగా జీతాలు రాక, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎల్.డేవిడ్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌నుకలుసుకుని, వినతి పత్రం అందజేశారు. గ్రామానికి ఒకప్పుడు ల్యాండ్ మార్కుగా ఉన్న ఊర చెరువు నేడు పూర్తిగా ఆక్రమణలకు గురై, కుచించుకుపోతుందన్నారు. దాన్ని అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగేలా పూర్తి స్థాయి పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు. గోదావరి జలాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం

అనపర్తి : ఏకకాలంలో మూడు రికార్డులు సాధించిన కుతుకులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నక్కిన వీర్రాఘవులును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రముఖుల జీవితాలు, ముఖ్య సంఘటనలు, పర్వదినాల ప్రాముఖ్యతలపై పాటలు రాసి, వాటిని స్వరపరచడం ద్వారా ఒకేసారి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వీర్రాఘవులు స్థానం సాధించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని కూనవరం శివారున పేకాటాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

యోగాంధ్రపై వీడియో కాన్ఫరెన్స్

రాజానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాలను రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు సమష్టి కృషితో విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల వీసీలతో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 21న విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో భారీ ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థులను, అధ్యాపకులను భాగస్వాములు చేయాలన్నారు. విదేశాలలో ఉన్న పూర్వ విద్యార్థులను కూడా ఆహ్వానించాలని సూచించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి, యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు పాల్గొన్నారు.

ఎర్ర బంగారం.. కాసుల వర్షం

- ఎర్రమట్టికి భారీ డిమాండ్
- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- యథేచ్ఛగా తవ్వేస్తున్న వైనం
- కనుమరుగవుతున్న కొండలు



కోటికేశవరంలో మట్టి మాఫియా తవ్వేసిన కొండలు

రాజానగరం: నియోజకవర్గం పేరు చెప్పగానే ఇసుక మాఫియా ఆధ్వర్యంలో ఇష్టానుసారంగా జరుగుతున్న గోదావరి ఇసుక దోపిడీ అందరికీ గుర్తుకు వస్తుంది. దాని తర్వాత దోపిడీలో అంతటి పేరుగాంచింది మాత్రం మట్టి మాఫియాయే. అధికారుల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగుతున్న ఈ దోపిడీతో నియోజకవర్గంలో కొండలు మాయమైపోతున్నాయి. చెరువులు పాతాళాన్ని చూపుతున్నాయి. విలువైన ప్రకృతి సంపద మాఫియాకి, వారికి మద్దతుగా నిలిచిన అధికార, అనధికార వ్యక్తులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా రాజానగరం మండలంలో ఎర్రమట్టి అపారంగా ఉంటుంది. ఇక్కడ కొండలనే కాదు చెరువులను తవ్వినా ఎర్రమట్టి వస్తుండటంతో దోపిడీదారులు దీనిని ఎర్రబంగారంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే చెరువులు ఖాళీ అయిపోగా, ప్రస్తుతం కొండలపై దోపిడీదారులు గురిపెట్టారు.

ఎర్రమట్టి కొండలు

నియోజకవర్గంలోని మూడు మండలాలలో కొండగుంటూరు, సంపత్ నగరం, జి.యర్రంపాలెం, కొత్త తుంగపాడు, కోటి కేశవరం – నల్లగొండ, శ్రీరంగపట్నం – మునగాల, రాఘవాపురం, కాటవరం పరిసరాలలో ఎర్రమట్టి కొండలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వీటి ఆనవాళ్లు క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు కనుపూరులోని దేవుని కొండను కూడా వదలలేదు.

అధికారుల కనుసన్నల్లోనే..

ఎర్రమట్టి మాఫియా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే తమ దోపిడీని సాగిస్తుందనేది జగమెరిగిన విషయమే. ఎందుకంటే అధికారంలో ఉన్న వారికి ఎదురునిలిస్తే, బదిలీల వేటు పడటంతో పాటు లేనిపోని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో కొంతమంది, చేతులు కలిపితే కాసులు దండుకోవచ్చనే ఆశతో కొందరు ఈ దోపిడీకి ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా సహకరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షాల గొంతుకు సమాధానం ఇచ్చేలా మైనింగ్, రెవెన్యూ అధికారులు అధికార పార్టీ మద్దతుదారులైన దోపిడీదారులకు నామమాత్రంగా అనుమతులిచ్చి, భారీ స్థాయిలో దోచుకునే అవకాశాలను కల్పిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనితో పైప్రాంతాలలో ఉన్న కొండలను అడ్డూఅదుపు లేకుండా, పగలు, రాత్రితో సంబంధం లేకుండా, భారీ యంత్రాలతో తవ్వేస్తున్నా పట్టించుకునేవారు లేరు.

అధిక ధరకు కొనుగోలు

కడియం మండలంలో విస్తారంగా ఉన్న నర్సరీలకు ఎర్రమట్టి ఎంతో అవసరం. దీనితో అక్కడి వ్యాపారులు ఈ ఎర్రమట్టికి అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తుంటారు. అందుకనే దీన్ని ఎర్ర బంగారం అని కూడా అంటారు. సాధారణంగా ఒక లారీ మట్టికి లోకల్‌గా రూ.నాలుగు వేలు పలుకుతుంది. అదే కడియం నర్సరీలకు రవాణా చేస్తే రూ.10 వేల నుంచి రూ. 20 వేల (దూరాన్ని బట్టి) వరకూ ముడుతుంది. అదే ట్రాక్టర్ మట్టికి రూ.ఆరు వేల నుంచి రూ. 10 వేల వరకూ దండుకుంటున్నారు. సుద్ద పొర లేని ఎర్రమట్టి (గ్రావెల్) లారీకి రూ.15 వేల నుంచి రూ. 25 వేల వరకూ ధర పలుకుతోంది. ఈ కారణంగానే ఎర్ర మట్టి కొండలను మాఫీ ముఠా పిండి చేసి, తమ జేబులు నింపుకుంటోంది.

ఆగని దోపిడీ



మండలంలో రెండు పర్యాయాలు మట్టి మాఫియా దోపిడీని అడ్డుకునేందుకు ప్రయత్నించాం. అయినా వారికి అధికారుల అండదండలు ఉండటంతో అర్ధరాత్రి సమయంలోనూ యథేచ్ఛగా దోపిడీ కొనసాగిస్తున్నారు. ఉభయులు కాసుల కోసమే చూస్తున్నారు గానీ, పర్యావరణ పరిరక్షణ గురించి ఆలోచించడం లేదు. ఎర్ర గ్రావెల్ దోపిడీని అధికారులు నిలువరించకపోతే ప్రకృతి పరంగా అనేక సమస్యలను ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

– మందారపు వీర్రాజు, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్, శ్రీకృష్ణపట్నం

ఫిర్యాదు చేసినా..



పోలవరం కాలువ గట్టును పొక్లెయిన్లతో తోడేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారు. రోజూ వందల లారీలు రవాణా అవుతుంటే, వాటి రాకపోకలతో దుమ్ము ధూళి ఎగసిపడుతోంది. దీనితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు తిరుగుబాటు చేసినా ఫలితం లేకపోయింది. అదేమని వచ్చి చూసిన అధికారి కూడా లేడు. అధికార పార్టీ అండదండలతోనే ఈ దోపిడీ జరుగుతుందనటానికి ఇదే నిదర్శనం.

– దాట్ల రఘు, రైతు నాయకుడు, కలవచర్ల

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా



వాల్వ్ నుంచి నీటి విడుదలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. కుమారప్రియం గ్రామంలోని వాటర్ ట్యాంకు జరుగుతున్న సూపర్ క్లోరినేషన్ ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. అలాగే అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ క్లోరినేషన్ ప్రక్రియ ద్వారా వాటర్ ట్యాంకు పైపులైన్ల లోపల ఉండే నాచు, ఇతర వ్యర్థాలు ఒక్కసారిగా బయటకు వచ్చి వాటర్ ట్యాంక్, పైపులైన్ శుభ్రంగా ఉంటాయన్నారు. వాటర్ ట్యాంకులో ఒక బస్తా క్లోరినేషన్ మూడు గంటల పాటు నీటిలో కలిపి ఉంచాలన్నారు. ఆ సమయంలో నీటిని బయటకు సరఫరా కాకుండా అన్ని వాల్స్ మూసివేయాలన్నారు మూడు గంటలలోపు బ్లీచింగ్ అక్కడి నాచును, వ్యర్థాలను వదిలించడానికి బాగా పట్టి ఉంటుందన్నారు. అనంతరం ట్యాంకు చివరి వాల్వ్‌ను ఒక్కసారిగా ఓపెన్ చేస్తే ఆ నీరు బయటకు పోతుందన్నారు. ఆ వేగానికి నాచు, ఇతర వ్యర్థ పదార్థాలు బయటకు వస్తాయన్నారు. దీని ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి సుంకర వీరస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివానీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి నాయకులు

- సూపర్ సిక్స్ పథకాల అమలెప్పుడు!
- వచ్చే నెల 4న వెన్నుపోటు దినోత్సవం
- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి



వైఎస్సార్ సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలతో నమ్మించిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆ మోసాన్ని పాలకులకు గుర్తు చేయడానికి జూన్ 4న వెన్నుపోటు దినం పేరుతో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. అనపర్తి నియోజకవర్గంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను హామీలను అమలు చేయాలని ఒత్తిడి తీసుకురావడానికే ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయెల్, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, అనపర్తి, సంపర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సబ్బెళ్ల కృష్ణారెడ్డి అద్దంకి ముక్తేశ్వరరావు, అనపర్తి పట్టణ పార్టీ కన్వీనర్ నల్లమిల్లి బాలమురళీమోహన బాలకృష్ణారెడ్డి, పెదపూడి, బిక్కవోలు మండలాల పార్టీ అధ్యక్షులు గుత్తుల రమణ, పోతుల ప్రసాదరెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంటి, శాప్ మాజీ డైరెక్టర్ గుబ్బల అలేఖ్యా లాజర్ బాబు, శ్రీవెంకటరెడ్డి, జిల్లా బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి కొమ్మనపల్లి శ్రీను, ఎంపీటీసీ సుధాకర్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొండేటి భీమేశ్వరస్వామి, జిల్లా వివర్స్ విభాగం అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రావణ్ కుమార్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం

అనపర్తి: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన మోర్త శ్రావణ్ కుమార్‌ను శుక్రవారం ఆయన ఘనంగా సత్కరించారు. పార్టీ విభాగాలలో కీలకమైన మైనార్టీ, క్రిస్టియన్ విభాగాన్ని బలోపేతం చేయాలని కోరారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, ఎంపీటీసీలు సబ్బెళ్ళ వీర్రాఘవ రెడ్డి, మట్టా శ్రీను, మత్సా వీరభద్రరావు, పెదపూడి జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, రమణ, వేండ్ర సర్పంచ్ వాసు, నియోజకవర్గ మున్సిపల్ విభాగాధ్యక్షుడు మండ వెంకటరెడ్డి, వేము చిరంజీవి, మేడపాటి ఆనందరెడ్డి, తాడాల మణికంఠ, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

మానసిక వైద్య చికిత్స కేంద్రం సందర్శన



జీఎస్ఎల్‌లోని మానసిక వైద్య చికిత్స కేంద్రాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

రాజానగరం: మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమన పొందిన వారు తమ కుటుంబ సభ్యులతో కలిసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. ఇందుకు అవసరమైన న్యాయ సహాయాన్ని తమ సంస్థ అందిస్తుందన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని మానసిక వైద్య చికిత్సా కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అక్కడ ఉన్న వారితోనూ, కుటుంబ సభ్యులతోనూ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

కాపర్ కేబుల్ చోరీ

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ పంచాయతీ బోర్‌వెల్‌కు చెందిన కాపర్ కేబుల్‌ను గురువారం రాత్రి దొంగలు తస్కరించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం .. స్థానిక దేవుని కోనేరు సమీపంలోని సూర్యభగవానుడి ఆలయం వద్ద పంచాయతీ అధికారులు బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి జూనియర్ కాలేజీ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ వరకూ 450 మీటర్లు త్రీఫేజ్ కరెంటు కేబుల్ కాపర్ వైర్ ఉంది. దీనిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆ వైర్ విలువ సుమారు రూ.12 వేలు ఉంటుంది. కాగా.. తీగ చోరీకి గురవ్వడంతో రక్షిత నీరు సరఫరాకు ఆటంకం కలిగింది.

• ప్రయాణమంటే హడలే..



రాఘవాపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇరుకు వంతెన

కోరుకొండ: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఇరుకు వంతెలు, శిథిలమైన బ్రిడ్జిల మీదుగా ప్రయాణం చేయడానికి ప్రజలు భయపడుతున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా కాలువల్లో పడే ప్రమాదం ఉండడంతో బెంబేలెత్తుతున్నారు. కోరుకొండ నుంచి రాఘవాపురం వెళ్లే రోడ్డులోని వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ లేదు. బురదకాలువపై నిర్మించిన ఈ వంతెనకు గతంలో రెండు వైపులా స్తంభాలు ఉండేవి. ప్రస్తుతం అవి శిథిలమైపోయాయి.

- బొల్లెద్దుపాలెం – గరగలంపాలెం వెళ్లే రోడ్డులో వంతెన స్లోప్‌గా ఉంటుంది. ఇటుగా రాత్రివేళల్లో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ప్రజలు ఇటుగానే రాకపోకలు సాగిస్తారు. ఈ మార్గంలో గతంలో జరిగిన ప్రమాదంలో కొందరు మృతి చెందారు, చాలామంది గాయపడ్డారు.
- జంబూపట్నం – గాదరాడ రోడ్డులో అనేక వంపులు ఉన్నాయి. రోమ్ సిటీ నుంచి అయ్యన్నగట్టు కాలువపై నుంచి జంబూపట్నం వైపునకు వెళ్లే రోడ్డులో వంతెన నిర్మించాలి.

కడుపు నిండేదెలా..

- అపర కర్మల షెడ్డు తొలగింపునకు అధికారుల యత్నాలు
- జీవనోపాధి పోతుందని పురోహితుల ఆవేదన
- వారికి శాపంగా మారిన అభివృద్ధి పనులు

రాజమహేంద్రవరం సిటీ: ఏదైనా ఒక ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతూ ఉంటే అందరూ సంతోషిస్తారు. వాటికి సహకారం అందించి తొందరగా పూర్తయ్యేలా చూస్తారు. కానీ ఆ అభివృద్ధి వల్ల తమ జీవనోపాధికి ఆటంకం కలిగేలా ఉంటే మాత్రం అడ్డుచెబుతారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో సుమారు వంద మందికి పైగా పురోహితులు ఇదే ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనులు తమకు శాపంగా మారాయని పురోహితులు, బ్రాహ్మణ సేవా సంఘాల ప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. ఆ వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

అపర కర్మల షెడ్డు

రాజమహేంద్రవరం కంబాల సత్రం సమీపంలోని గోదావరి గట్టున గల పద్మావతి ఘాట్‌లో అపర కర్మలు నిర్వహించేందుకు షెడ్డు ఏర్పాటు చేశారు. ఆ షెడ్డులో దశాబ్దాలుగా సుమారు వందమందికి పైగా పురోహితులు పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే నగర అభివృద్ధిలో భాగంగా గోదావరి ఘాట్లను ఏకం చేసే కార్యక్రమం చేపట్టారు. గోదావరి రివర్ ఫ్రంట్ పేరుతో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పద్మావతి ఘాట్‌లోని అపర కర్మల షెడ్డును తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అపర కర్మల నిర్వహణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పురోహితులు తమ జీవనోపాధికి మార్గం ఏమిటా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు, కలెక్టర్ తదితరులు తమ జీవనోపాధికి భంగం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

తీవ్ర నిరసన

అపర కర్మల షెడ్డును తొలగించి సమీపంలోని మార్కండేయ స్వామి ఘాట్ వద్ద ఏర్పాటు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. అయితే ఆ మార్పుపై భక్తుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. మార్కండేయేశ్వరస్వామి ఘాట్‌లో ప్రతి కార్తిక మాసంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. భవాని, అయ్యప్పస్వామి, శివమాలధారులు కూడా పుణ్యస్నానాలు ఆచరిస్తారు. దీంతో ఆ ఘాట్‌లోనే అపర కర్మలకు షెడ్డు ఏర్పాటు చేస్తామని కమిషనర్ ప్రకటించడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిపై ప్రభావం

షెడ్డు తొలగింపు కారణంగా పౌరోహిత్యంపై జీవనం సాగిస్తున్న వందమందికి పైగా పురోహితుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని నగర బ్రాహ్మణ సంఘం ఆవేదన వ్యక్తం చేస్తోంది. పద్మావతి ఘాట్‌లోనే మరో ప్రాంతంలో షెడ్డు ఏర్పాటు చేస్తే వెసులుబాటుగా ఉంటుందని చెబుతోంది. ఈ సమస్యపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పురోహితుల జీవనానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతోంది.



నగరాభివృద్ధిలో భాగంగా తొలగించనున్న అపర కర్మల షెడ్డు

జీవనోపాధికి గండి



పద్మావతీ ఘాట్‌లోని అపర కర్మల షెడ్డును తొలగిస్తే పురోహితుల జీవనోపాధికి గండి పడే ప్రమాదం ఉంది. మార్కండేయేశ్వరస్వామి ఆలయం సమీపంలోని గోదావరి ఘాట్‌లో భక్తులతో పాటు శివ, అయ్యప్ప, స్వామి మాలధారులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఆ ప్రాంతంలో అపర కర్మలు నిర్వహించేందుకు షెడ్డు ఏర్పాటు చేయాలనుకోవడం సరైన విధానం కాదు. ఈ నేపథ్యంలో పద్మావతి ఘాట్‌లో షెడ్డు ఏర్పాటు చేస్తే పురోహితులకు ఏ విధమైన ఇబ్బంది ఉండదు.

– మాదిరాజు శ్రీనివాస్, బ్రాహ్మణ సేవాసంఘం జిల్లా ప్రతినిధి, రాజమహేంద్రవరం

పురోహితులను ఆదుకోవాలి



పౌరోహిత్యంపై ఆధారపడి అపర కర్మలు చేస్తున్న వంద మందికి పైగా పురోహితులకు షెడ్డు తొలగింపుతో ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయంపై అధికారులు పూర్తి స్థాయి చర్యలు చేపట్టి, వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా షెడ్డు నిర్మాణం చేపట్టాలి. వేరే ప్రాంతంలో ఏర్పాటు చేస్తానని చెప్పి పురోహితులను మభ్యపెట్టే ప్రయత్నాలు కాకుండా, అభివృద్ధి చర్యల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే నిర్మించాలి. పురోహితులకు మేలు కలిగే విధంగా చర్యలు చేపట్టాలి.

– దూర్వాసుల సత్యనారాయణ, నగర బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు, రాజమహేంద్రవరం

యోగాంధ్రను విజయవంతం చేద్దాం



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీ చిన్నరాముడు కోరారు. యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రాండ్ ట్రంక్ రోడ్డులో ఐదో రోజు శుక్రవారం యోగా సాధన కొనసాగింది. వైద్యాధికారులు, వైద్యులు (మెడికల్ ఆఫీసర్స్ – డాక్టర్స్) అనే థీమ్‌తో వైద్య, ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఓఎన్జీసీ కమ్యూనికేషన్స్ అధికారి డాక్టర్ పి.రామచంద్ర యోగా సాధన చేయించారు. యోగా ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ 45 నిమిషాలు సూక్ష్మ వ్యాయామం, త్రికోణాసనం, భద్రాసనం, భుజంగాసనం వేయించారు. గిన్నిస్ రికార్డు గ్రహీత, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ విద్యార్థిని వి.సాత్విక అబ్బురపరిచే రీతిలో యోగాసనాలు వేశారు. అనంతరం ధ్యానం చేయించారు.

అందరూ హాజరుకావాలి

జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం అయిన జూన్ 21వ తేదీ వరకు ఈ యోగాంధ్ర కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. జూన్ 21న నగరంలో ఎక్కువమంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి మాట్లాడుతూ ఏడు లక్షల మంది ఈ కార్యక్రమంలో నమోదు కావాలన్నది జిల్లాకు ఇచ్చిన లక్ష్యమని, దీన్ని చేరుకోవడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. అందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జూన్ ఒకటిన సరస్వతీ ఘాట్‌లో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.